## అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే

# కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ తుషార్ డూడి**



**బాపట్ల నవభూమి :** దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు,నిల్వ చేసే గోడౌన్స్,విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని,ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి శుక్రవారం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. విక్రయదారులు,గోడౌన్స్,తయారీ కేంద్రాల యజమానులు పాటించవలసిన నిబంధనల గురించి వివరించారు. గతంలో వివిధ ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల శ్రేయస్సును ఉద్దేశించి బాణాసంచా తయారీ కేంద్రాలకు,నిల్వ చేసే గోడౌన్లకు,విక్రయించే దుకాణాలకు పలు నియమ నిబంధనలు సూచించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో బాణసంచా తయారీ,విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి ప్రభుత్వ నియమ నిబంధలకు లోబడి బాణసంచా విక్రయించాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారుచేసిన,నిల్వ చేసినా,విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్ అధికారులు వారి పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాలను,విక్రయ దుకాణాలను,నిల్వ ఉంచిన గోడౌన్‌లను సందర్శించి లైసెన్స్‌లు తనిఖీ చేయాలన్నారు. భద్రత ప్రమాణాలు ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా ఉన్నాయా లేదా పరిశీలించాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను పాటించని యడల వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా సామగ్రి అక్రమ విక్రయాలు,నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100,112 నెంబర్ లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. నిబంధనలు : బాణాసంచా నిల్వచేసే గూడెం నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి అనుమతులు పొందాలి. నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలి. ఆ ప్రదేశాలలో ప్రమాదం జరగడానికి అవకాశం వుండే సిగరెట్లు తాగడం వంటి చర్యలు చేయరాదు. మండే స్వభావం ఉన్న పెట్రోల్, అగ్గి పెట్టెలు ఇతర వస్తువులు అనుమతించరాదన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన ఉండాలి. బాణాసంచా విక్రయ దుకాణాలు అధికారులు సూచించిన ప్రదేశాలలోనే ఏర్పాటు చేసుకోవాలి. జనావాసాలకు, విద్యాసంస్థలకు,వైద్యశాలలకు దూరంగా బాణాసంచా విక్రయాలు జరగాలి. బాణాసంచా విక్రయ దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు,రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలి.

# సమన్వయంతో పనిచేయాలి




# నవభూమి

## జిల్లా అనుబంధం



26 అక్టోబర్,2024 శనివారం | పేజీలు:6

www.epaper.navabhoomi.in


## మండలంలోని సమస్యలను

# పరిష్కరించాలి:సీపీఐ



**ఎటపాక నవభూమి న్యూస్ :** మండల సమస్యలను పరిష్కరించాలనీ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ పేర్కొన్నారు. యటపాక మండలం లోని గన్నవరం లో సీపీఐ సమవేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన, వరదల వల్ల రైతులు నష్ట పోయి, వ్యవసాయం పనులు లేకుండా పోయాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పథకాన్ని ఎన్నడు లేని విధంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నందున మా నాలుగు మండలాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం లో జాబ్ కార్డు ఉన్న కుటుంబానికి 150 రోజులకు పెంచాలని, కేవలం పోడు పట్టాలున్న కుటుంబానికి మాత్రమే 150రోజులు పని కల్పిస్తున్నారని, పోలవరం నిర్వశిత ప్రాంతం లోని ఉపాధి హామీ కూలీలందరికి 150 రోజులు పనిదినాలు పెంచాలని, మండలంలోనీ కొల్లూగూడెం నుండి మురుమూరు వరకు వున్న గ్రామాల ప్రజలకు మిగతా మండలాల వారికి ఇచ్చిన విధంగా జీవనభృతి 4800 రూపాయలు ఇవ్వాలన్నారు. యటపాకమండలం లోని పోలవరం ప్రాజెక్టు ముంపు భూములకు, గ్రామాలకు కాంటూరు తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలని డిమాండ్ ఛేశారు. అంతే కాకుండా కొత్త పింఛన్ లు ఇవ్వాలని, ఇటివల కాలం లో మరణించిన అర్హులైన వారందరికీ చంద్రన్న భీమా వెంటనే అందించాలన్నారు. నాలుగు మండలాల్లో ఉపాధి హామీ పథకం లో కొత్తగా సీసీ రోడ్లు, డ్రైన్లు మంజూరు చేయాలనీ తెలిపారు. విద్యుత్ అధికారులు సచివాలయం జూనియర్ లైన్ మెన్ లను పంచాయతీ పనులు అయినా వీధి లైట్లు, మోటార్ రిపేర్ పనులకు పంపడం లేదని, సర్పంచ్ లు గ్రామస్థులతో మాటలు పడుతున్నారని, ఈ విషయాన్ని త్వరలో పీవో దృష్టికి తీసుకొని వెళతామన్నారు. ఎంపీటీసీ కంటే రాజు మాట్లాడుతూ ఎంపీటీసీ పనులకు సంబందించిన అనుమతులు ఇవ్వకుండా ఎంపీడీఓ కార్యాలయం అధికారులు అలసత్వం వహిస్తున్నారని, వెంటనే అనుమతులు ఇవ్వాలని లేదంటే ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమం లో గన్నవరం సర్పంచ్ గడ్డం భద్రమ్మ, వల్లభనేని సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి యాలిశాల నాగరాజు, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాతృ మరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి



# అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

### అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుల డిమాండ్



**దెందులూరు అక్టోబర్ 25 నవభూమి** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను అందరు విద్యార్థులకు తెలిసేలా పాఠశాలల్లో కళాశాలలో పాఠ్య అంశంగా చేర్చాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు దాన మాంద్రు మధుబాబు. చిలకా హరీష్. సరిపల్లి మహేష్ .గులిమే హరిబాబు. భీమడోలు రామకృష్ణ .చిలక విష్ణు. నాగు వసంత్ .వంశీ మహేష్ చిలక వంశి తాని గడప సంతోష్ చిలక పవన్ గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కండ్రిగ నర్సాపురంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ భారతదేశం ఔన్నత్యాన్ని ఇనుమడింప చేసేలా దేశ పరిపాలన ప్రపంచానికి ఆదర్శవంతంగా జరిగేలా ప్రణాళిక బద్దంగా శ్రమించి రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుని జీవిత విధానం భారత వారికి ఆదర్శప్రాయం అన్నారు నేటి యువత ప్రతి ఒక్కరు ఆయన జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకొని జీవించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు అందరు ప్రజా ప్రతినిధులు ఈ మేరకు మద్దతు లేఖలు ఇవ్వాలని తాము సంతకాల సేకరణ ప్రారంభించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామని అన్నారు.

# సైబర్ మోసాలపై వ్యాసరచన పోటీలు: ఎస్సై ఖాదర్ బాషా



**అద్దంకి, అక్టోబర్ 26 ( నవభూమి )** అద్దంకి పట్టణంలోని బెల్ అండ్ బెనిట్ పాఠశాల నందు శుక్రవారం పోలీస్ అమరవీరుల వారోత్సవ కార్యక్రమాలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో విద్యార్థులకు సైబర్ మోసాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్సై ఖాదర్ బాషా పర్యవేక్షించారు. విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. సైబర్ మోసాలపై సరైన అవగాహన లేక చాలామంది కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారని ఎస్సై ఖాదర్ బాషా తెలియజేశారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుంటే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# అంబులెన్స్‌కు దారి ఇవ్వని ఆర్టీసీ డ్రైవర్, అధికారులు స్పందించాలి

**పంగులూరు, అక్టోబర్ 26 ( నవభూమి)** పంగులూరు నుండి బూదవాడ వెళుతున్న 108 అంబులెన్స్ కు ఇంకొల్లు నుండి అద్దంకి వెళుతున్న ఆర్టీసీ బస్సు దారి ఇవ్వని సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అంబులెన్స్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి పంగులూరు సెంటర్ కు వచ్చేసరికి ఎదురుగా బస్సు వచ్చింది. అత్యవసర కేసు ఉందని దారి ఇవ్వాలని అంబులెన్స్ పైలెట్ ఆర్టీసీ డ్రైవర్ ను కోరగా ససేమిరా అనటంతో చేసేదేమీ లేక అంబులెన్స్ పైలట్ వెనక్కి వెళ్ళాడు. దీంతో బస్సు డ్రైవర్ తీరుపై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.




### బాలల సంరక్షణకు అన్నిశాఖల అధికారులు

# సమన్వయంతో పనిచేయాలి

◆ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ బి.పద్మావతి





**నెల్లూరు,అక్టోబర్ 25,(నవభూమి)::** రాజ్యాంగ వ్యవస్థలో ఉన్న అన్ని చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లాలో బాలల సంరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ బి పద్మావతి సూచించారు. శుక్రవారం ఉదయం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలో బాలల సంరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కమిషన్ చైర్‌పర్సన్ పద్మావతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తున్నట్లు చెప్పారు. బాలల సంరక్షణే లక్ష్యంగా అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయన్న చైర్‌పర్సన్ అన్ని వ్యవస్థలు కూడా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన,బాలల అపహరణ,బాలికల అత్యాచారాలు వంటి అమానవీయ సంఘటనలు జరగకుండా సమర్ధవంతంగా,బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బాలకార్మికుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, జిల్లాలో సుమారు 60మంది బాలలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించినట్లు ఆమె చెప్పారు. మాదక ద్రవ్యాలు,మద్యపానం వంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీక్లబ్‌లు ఏర్పాటుచేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె చెప్పారు. బాలల సంరక్షణ కేంద్రాలు, బాలసదన్‌లు,శిశుగృహాలో వుంటున్న అనాథ చిన్నారులను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చే ప్రయత్నాలు చేస్తున్నామని, తల్లిదండ్రుల ఆచూకీ దొరకకపోతే నిబంధనల మేరకు దత్తత ప్రక్రియ చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు,యాచకవృత్తికి చిన్నారులను ఉపయోగించడం, బాలికలపై అత్యాచారాలు మొదల్కైన బాలల హక్కులకు భంగం కల్గించే అంశాలపై కమిషన్ ప్రత్యేకదృష్టితో పనిచేస్తుందని చెప్పారు. జిల్లాలో అనాధలు, భద్రత లేని చిన్నారుల గుర్తించేందుకు,బాలకార్మిక వ్యవస్థ,బాలవివాహాల నిర్మూలనకు జిల్లా కలెక్టర్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారని,ఈ కమిటీ ద్వారా జిల్లాలో బాలల సంక్షేమానికి ఓ మంచి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. ఐసిడిఎస్ పరిధిలోని మహిళా శిశు సంక్షేమశాఖ,బాలల సంరక్షణ కమిటీ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అందరూ జిల్లాలో చిన్నారుల సంక్షేమం,భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టి అనాథ బాలలు,వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారులను తమ పిల్లల వలె భావించి వారి జీవితానికి భరోసాగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్,జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వరరావు,జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, సమత,ఐసిడిఎస్ వివిధ విభాగాల అధికారులు, బాలల సంరక్షణ కేంద్రాలు,స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

### మాతృ మరణాలను అరికట్టడానికి

# అధికారులు చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ప్రఖర్ జైన్**

**బాపట్ల–నవభూమి:** మాతృ మరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మాతృ మరణాలపై సంబంధిత వైద్య,ఆరోగ్యశాఖ అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. బాపట్ల జిల్లాలో మాతృ మరణాలు అరికట్టడానికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. గత మూడు నెలలుగా ఏడు మాతృ మరణాలు నమోదు కావడంపై క్షుణ్ణంగా ఆరా తీశారు. మరణాలకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణతోనే మాతృ మరణాలు పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. మహిళలు గర్భిణీలు కాగానే దస్త్రాలలో నమోదు చేయాలన్నారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులకు రక్తహీనత ఉంటే ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాంటి వారికి ప్రణాళికాబద్ధంగా ముందస్తుగానే పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. వైద్యం అందించడంలో లోపాలను సవరించుకోవాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ,డి. సి.హెచ్.ఎస్ కో–ఆర్డినేటర్ శేషుబాబు,డాక్టర్లు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కూరేళ్లగూడెం.పూళ్లలో 9 విలేజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ దాబా రెస్టారెంట్ ప్రారంభం



**దెందులూరు అక్టోబర్ 25 నవభూమి** యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తూ చిన్నచిన్న పరిశ్రమలు. ఫ్యామిలీ రెస్టారెంట్లు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందెందుకు ముందుకు వెళ్లడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు.పూళ్ల సహకార సంఘం బ్యాంకు మాజీ అధ్యక్షులు టిడిపి నేత గన్ని గోపాలరావు అన్నారు. శుక్రవారం కుర్రెళ్లగూడెం పూళ్ల గ్రామాల పరిధిలో నేటి జాతీయ రహదారి పక్కన 9 విలేజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు దాబాను టిడిపి నేత గన్ని గోపాలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నైన్ విలేజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు దాబాను ఏర్పాటు చేసిన దాబా అధినేతలు ఆలపాటి యశ్వంత్ .షేక్ మహమ్మద్ షరీఫ్ లను వారు అభినందించారు. వినూత్న పద్ధతిలో సంప్రదాయ రకరకాల వంటలతో పెరుగుతున్న అభిరుచి టెక్నాలజీకి అనుగుణంగా మంచి నాణ్యతతో పరిశుభ్రతతో క్వాలిటీతో ఖాతాదారులు ప్రజలు మనసులో గెలుపొంది మంచి పేరు తెచ్చుకోవాలని గన్ని వీరాంజనేయులు. గన్ని గోపాలరావు వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షులు రాయపాటి సత్యనారాయణ చాట్రాయి సత్యనారాయణ మూర్తి. ఆలపాటి అనిల్. ఆలపాటి రామారావు. తదితరులు పాల్గొన్నారు

## ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో ఏపీసీసీ చీఫ్ వై.ఎస్ షర్మిలారెడ్డి భేటీ

### 28న విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో జిల్లా సమీక్ష సమావేశం

### నియోజకవర్గ ముఖ్య నాయకులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



**పొదిలి, అక్టోబర్ 25 ( నవభూమి )** ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో ఏపీసీసీ చీఫ్ వై.యస్. షర్మిల రెడ్డి ఈనెల 28.వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల కు విజయవాడలో ని ఆంధ్ర రత్న భవన్ లో భేటీ కానున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు చెందిన నియోజకవర్గ పార్టీ బాధ్యులు, జిల్లా, రాష్ట్ర స్థాయి వివిధ పార్టీ కమిటీల్లో ఉన్నవారు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు హాజరుకావాలని సైదా కోరారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థ గత నిర్మాణం, జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలు, వాటి పరిష్కారానికి పార్టీ తరపున చేయబోయే ఉద్యమాలు తదితర అంశాలు మీద పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్ .షర్మిలారెడ్డి , ఏఐసీసీ సహాయ కార్యదర్శి ఏపీ ఇంచార్జ్ పాలక్ వర్మ దిశ నిర్దేశం చేయనున్నట్లు షేక్ సైదా అన్నారు. ఈ సమావేశానికి ఒంగోలు ,కొండేపి, సంతనూతలపాడు, దర్శి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ బాధ్యులు బాధ్యత తీసుకొని సకాలంలో ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు అందరూ హాజరయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా కోరారు.

### చికిన్ సెంటర్‌ను తనిఖీ చేసిన గుడివాడ పురపాలక సంఘ

# అసిస్టెంట్ కమిషనర్










**కృష్ణాజిల్లా గుడ్లివాడ నియోజకవర్గం** శుక్రవారం మధ్యాహ్నం శానిటేషన్ అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్యం ప్రజా ఆరోగ్యం దృష్ట్యా పలు చికెన్ షాపులు తనిఖీలు నిర్వహించారు..గుడివాడ బంటుమిల్లి రోడ్ లో ఉన్న ఎస్.వి.ఆర్ చికెన్ సెంటర్లో లెక్కకు మించిన కోళ్లను నివాస స్థలాల మధ్యలో నిల్వలు చేయడం సరికాదన్నారు. వందల కోళ్లు ఇండ్ల మధ్యలో నిల్వల వల్ల ముబారక్ సెంటర్,గుడ్ మెన్ పేట, దగ్గర ఉన్న పరిసర ప్రాంత ప్రజలు తరచూ జబ్బులు పడుతున్నారని ఫిర్యాదు వస్తున్నాయి అని అన్నారు. కోళ్లకు తరచూ వచ్చు జబ్బులు వల్ల ప్రజలు అనారోగ్యపాలు అవుతున్నారని మీ వ్యాపారుల లాభాల కోసం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు గురైనా ఉపేక్షించేది లేదన్నారు..బ్రాయిలర్ కోడి మార్కెట్లోకి 45 రోజులో పెరిగి వస్తున్నాయి.బ్రాయిలర్ కోళ్లు దిగుబడి కోసం వ్యాపారులు స్టరైడ్స్ వినియోగిస్తూ కోళ్లను ఇట్టే బరువు పెంచి మార్కెట్లో తెస్తూ వ్యాపారాలు చేస్తున్నారు. ఈ బ్రాయిలర్ కోళ్లు ప్రజలు వినియోగించడం వల్ల ఆడపిల్లల శరీరంలో అనేక మార్పులు వస్తున్నాయి.. ఇలాంటి కోళ్ళ పెంపకాలు నివాస స్థలాల్లో పెంచి 45 రోజుల్లో పెరిగిన కోళ్ళు ప్రజలు తినడం వల్ల చిన్న పిల్లల్లో మార్పులు వస్తున్నాయి అని అన్నారు. కోడి వ్యర్థాలు ఇక్కడ నుండే ఫిష్ టాంక్స్ కి తరలిస్తున్నారని ఇలా చేయడం వల్ల ప్రజా ఆరోగ్యం దెబ్బ తింటుందని హెచ్చరించారు.ఇక శుభ్రత లోపించిన కోళ్లు నిల్వలు అధికంగా ఇక్కడ నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఎస్.వి.ఆర్ చికెన్ సెంటర్లో అణువణువు పరీక్షించి...పేరెంట్ కోళ్లు ఆరోగ్యం వయసు కనుకొని వాటికి తగిన విధంగా భద్రత తీసుకొని ప్రజా ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు లేకుండా జాగ్రత్తలు పాటించాలి అని సూచించారు.గుడివాడ బంటుమిల్లి రోడ్ లో ఉన్న పలు చికెన్ షాపులు లైసెన్సులు షాపు యొక్క మురుగనీరు ఔట్ లెట్ తనిఖీలు చేశారు

### ఆస్తికోసం తల్లి,చెల్లినే

# జగన్ బ్లాక్‌మెయిల్

- ◆ పది జన్మలు ఎత్తిన క్షమించరాని పాపాలను మూటకట్టుకున్న జగన్
- ◆ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి



**నెల్లూరు,అక్టోబర్ 24, (నవభూమి)::** జన్మనిచ్చిన తల్లిని,చెల్లిని బ్లాక్ మెయిల్ చేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పది జన్మల పాపాలను మూటగట్టుకున్నాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.నెల్లూరు నగరంలోని స్థానిక జర్నలిస్ట్ భవన్ ప్రెస్ క్లబ్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్తి కోసం తల్లి, చెల్లినే బ్లాక్ మెయిల్ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి క్షమించరాని తప్పు చేశారని ఆరోపించారు. వైయస్ షర్మిలను పొలిటికల్ గా సరెండర్ చేసుకోవడానికే జగన్ బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. సరస్వతీ పవర్ అండ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆస్తులను భారతి పేరుతో సొంతం చేసుకోవాలనుకునే కుట్రలో భాగంగానే వైయస్ షర్మిలపై ఆస్తుల పంపకం అడుగుతోందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.తల్లి, చెల్లికి ఇచ్చిన ఆస్తులకు సంబంధించిన గిఫ్ట్ డీడ్ లను రద్దు చేయమని నిన్న ఎన్.సీ.ఎల్.టీకి ఫిర్యాదు చేయడం ఎంతవరకు న్యాయమో ఆయనే చెప్పాలని ప్రశ్నించారు.వైఎస్ కుటుంబం ఆస్తుల వివాదాల విషయాన్ని ప్రశ్నించే అర్హత ప్రజలకు లేకున్నప్పటికీ,జగన్మోహన్ రెడ్డి క్రూర మనస్థత్వం గురించే మాట్లాడే అర్హత ప్రతి ఆంధ్రుడుకి ఉందన్నారు.ఓట్ల కోసం నాతల్లి,నాచెల్లి,నా అక్క,నా తండ్రి,నా అన్న అంటూ రాజకీయ ప్రస్థానం సాగించిన వైయస్ జగన్ సొంత తల్లి,చెల్లికి మాత్రం ద్రోహం చేసేందుకు ఏమాత్రం ఆలోచించడం లేదనే విషయం ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు.జగన్మోహన్ రెడ్డి క్రూరమైన చేష్టలు,మోసాన్ని భరించలేక ఆయన తల్లే కుమార్తె షర్మిలమ్మ వైపు మొగ్గు చూపిందన్నారు.ప్రజల ఆస్తులను అక్రమంగా దోచుకున్న జగన్మోహన్ రెడ్డికి తల్లి,చెల్లి విషయంలో మాత్రం మనస్సు ఒప్పడం లేదన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధీనంలో ఉన్న అంతా కూడా ప్రజల ఆస్తే అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తన కుటుంబానికి చేసిన ద్రోహాలకు,ఆయన క్రూరమనస్తత్వానికి అనేక ఉదాహరణలున్నాయన్నారు.ఈడీ,సీబీఐ కేసుల్లో తనకు సంబంధం లేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును ఇరికించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల సొత్తును కొల్లగొట్టి ఆస్తులు పోగేసుకుని దేశంలోనే రెండో స్థానంలో కొనసాగుతూ ఇప్పుడు తల్లి,చెల్లిని మోసం చేయడం బాధాకరం అని అన్నారు.2009లో భూములు పొంది 2015 వరకు పరిశ్రమను ప్రారంభించని కంపెనీకి ఎందుకు అనుమతులు కొనసాగించాలనీ ప్రశ్నించారు.


## పెరిగిన నిత్యవసర
# ధరలను అరికట్టాలి
### తగ్గించిన పాల ధరలను వెంటనే పెంచాలి




**మాడుగుల అక్టోబర్ నవభూమి** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని,విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేసారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం మండల కార్యదర్శి బిటి దొర అద్యక్షతన జరిగిన ఈ సమావేశం లో వారు మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి పోయాయని సామాన్య మద్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై నవంబరు 1 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా అందోళన చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.అదేవిధంగా విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ఉత్పత్తి దార్లనుండి సేకరిస్తున్న పాల కు ధరలను తగ్గించడం అన్యా యమన్నారు.నేడు వ్యవసాయ రంగం లాభ సాటిగా లేక పోవడం వలన ఉత్తరాంధ్ర జిల్లాలోని సుమారు 3 లక్షల మంది రైతులు పాడి పై ఆధార పడి ఆవులు , గేదెలను మేపు కొని తమ కుటుంబాలను పోషించు కుంటున్నారని తెలిపారు.ఈరోజు డెయిరీ ఇస్తున్న ధర ఏమాత్రం గిట్టుబాటుగా లేదన్నారు. కనీసంగా ఆవుపాలకు లీటరకు 50 రూపాయలు,గేదె పాలకు లీటరకు 100 రూపాయలు ఇవ్వాలి.కానీ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలుకి లీటరుకు మూడు రూపాయలు తగ్గించడం వలన పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు .పశుపోషణ వ్యయం విఫరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలు పెంచకుండా ధరలను తగ్గించడం దుర్మార్గమన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాల ధరలను పెంచి పాడి రైతులను ప్రోత్సహించాల్సిన విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలను తగ్గించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా పాల సేకరణ ధర తగ్గించడం సరికాదని తెలిపారు.గత రెండేళు గా పాడి రైతులకు బోనస్ ఇవ్వ కుండా తీవ్ర ద్రోహం చేసిందని తెలిపారు.వెంటనే విశాఖ డెయిరీ యాజమాన్యం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించకపోతే పాడి రైతులను సమీకరించి ఉద్యమిస్తామని తెలిపారు. అదే విధంగా నిత్యవసర వస్తువులు ధరలు వీపరీతంగా పెరిగి పోయాయని దీనిపై ప్రజలతో కలిసి గట్టి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.సన్నిబాబు మూలగుమ్మి ఎర్రునాయుడు షేక్ అప్పాజి సిహెచ్ దేముడు కె ఈశ్వరావు వి దోంగబాబు జె ఈశ్వరావు డి దాసు జె పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసానికి ముస్తాబవుతున్న శివాలయాలు

**మాడుగుల అక్టోబర్ నవభూమి** మాడుగుల: గ్రామం లోని శివాలయాలు కార్తీక మాసం పురస్కరించుకుని దేవాలయాలు ముస్తాబావుతున్నాయి. మాడుగుల లోని పురాతన ఆలయం గా ప్రసిద్ధి చెందిన శ్రీ పార్వతీ భీమలింగేశ్వర ఆలయం కార్తీక మాసం సందర్బంగా ముస్తాబవుతోంది.కార్తీక మాసం సందర్బంగా ఆలయానికి రంగులతో ముస్తాబు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జరుగుబిల్లి సుబ్బారావు మాట్లాడుతూ కార్తీక మాసం నవంబర్ 2 వ తేదీ నుంచి డిసెంబర్ 1 వ తేది వరకు ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం స్వామి వారికి ప్రత్యేకంగా విశేష పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



## ప్రతి సామాన్యుడికి ఉచిత
# ఇసుక అందే వరకు పోరాడుతాం

- ◆ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం విఫలం
- ◆ వైసీపీ నగరం నియోజకవర్గం ఇంచార్జ్,ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి
- ◆ జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వైసీపీ జిల్లా నేతలు
- ◆ మాజీ మంత్రి,వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి












**నెల్లూరు,అక్టోబర్ 24, (నవభూమి):**:తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని,ప్రతి సామాన్యుడికి ఉచిత ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు ఆదుకోవాలని,లేని పక్షంలో హామీలు అమలు చేసేంత వరకు పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేస్తుందని మాజీ మంత్రి,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. ప్రతి సామాన్యుడికి ఉచిత ఇసుక అందించాలని కోరుతూ నెల్లూరు జిల్లా అన్ని నియోజకవర్గాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి,మాజీ ఎమ్మెల్యేలు,అన్ని నియోజకవర్గాల ఇంచార్జ్ లు కలిసి నెల్లూరు నగరంలోని విఆర్సి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. కలెక్టరేట్ గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాజీమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత ఇసుక,అక్రమ మద్యం షాపుల ఏర్పాటుతో తెలుగు దేశం పార్టీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దోచిపెడుతున్నాడని విమర్శించారు.తెలుగుదేశం పార్టీ విధానాలను మార్చుకోకపోతే.. రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గం ఇంచార్జ్,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించి.. ఈ రోజు అధికారంలోకి వచ్చి.. ఆ హామీలన్నీ నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలమయ్యారన్నారు. ఉచిత ఇసుక అందిస్తామని తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందడం లేదన్నారు.తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు లిక్కర్ షాపులు ఏర్పాటు చేస్తూ.. మహిళలను కన్నీటి పాలు చేస్తున్నారని విమర్శించారు.తెలుగుదేశం పార్టీలో ప్రజాప్రతినిధులే ఈ విధమైన విధానాలు అవలంబిస్తుంటే.. ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఉచిత ఇసుక,మద్యం షాపులు రెండు తెలుగుదేశం పార్టీ నాయకుల కనుసన్నలోనే నడుస్తున్నాయన్నారు.ఉచిత ఇసుక అందక సామాన్యులతో పాటు భవన నిర్మాణ కార్మికులకు కూడా పనులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగు దేశం పార్టీ నేతలు ఇసుకను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ.. పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపుతున్నారని అన్నారు.ప్రతి సామాన్యుడికి ఉచిత ఇసుక అందే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగా మురళి,మాజీ ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మేకపాటి విక్రమ్ రెడ్డి,రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి,కిలివేటి సంజీవయ్య,నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి,కందుకూరు ఇంచార్జ్ బుర్ర మధుసూదన్ యాదవ్,ఉదయగిరి ఇంచార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల సీనియర్ నాయకులు,ముఖ్య నేతలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆధార్ క్యాంపును సందర్శించిన ఎంపిడిఓ కె.అప్పారావు

**మాడుగుల అక్టోబర్ నవభూమి** మండలం లోని ప్రతి గ్రామంలో ఉచిత ఆధార్ క్యాంపు లు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా మండలం లోని సాగరం గ్రామం లో ఉచిత ఆధార్ క్యాంపు ను ఎంపిడిఓ కె.అప్పారావు సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి పూర్తి వివరాలు సేకరించి ఆధార్ నమోదు చేసేటపుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు.అలాగే గ్రామం లోని ప్రతి ఒక్కరు ఈ ఆధార్ క్యాంపు లను సద్వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి హుస్సేన్ ఆధార్ నమోదు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు



**నవభుమి - బాపట్ల :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పోలీస్ సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అను అంశంపై వ్యాసరచన పోటీలను పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ పోటీలలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసులు అహర్నిశలు కృషిచేస్తారన్నారు. ప్రతి ఒక్కరికి ఒక కుటుంబం ఉంటుంది, కానీ పోలీస్ మాత్రం తన కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా తన కుటుంబంలో భాగంగా భవిస్తాడన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తమ ప్రాణత్యాగాలకు కూడా వెనుకాడరని తెలిపారు. పోలీస్ సిబ్బందిలో వున్న ప్రతిభను వెలికి తీసేందుకు, ప్రస్తుత సమాజంలో ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసులు పాటు పడుతున్న తీరును ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అను అంశంపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. వ్యాసరచన పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## అందుబాటులోకి చెత్త తరలింపు వాహనం

### రోడ్లపై చెత్తను వేయకూడదు

### సర్పంచ్ ఎడ్ల కళావతి




**మాడుగుల అక్టోబర్ నవభూమి** గ్రామం లోని ఎట్టకేలకు తడి చెత్త, పొడి చెత్త తరలింపు వాహనం అందుబాటు లోకి వచ్చినట్లు గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రెండేళ్ళ క్రితం ఈ చెత్త తరలింపు వాహనం మరమ్మత్తులకు గురైందని, తిరిగి మరమ్మత్తులు పూర్తి చేసి అందుబాటు లోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. కావున గ్రామం లోని ప్రజలంతా ఈ చెత్త వాహనాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. అలాగే గ్రామం లోని ప్రతి ఒక్కరు తమ ఇంటి చుట్టూ ప్రక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని , రోడ్లపై చెత్త వేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు , పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. మూర్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీ మాసం సందర్భంగా...

కార్తీ మాసం సందర్భంగా సూర్యలంక సముద్ర తీరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు గురించి బాపట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు.



## ఎమ్మెల్యే ఏలూరి ప్రజా దర్బార్‌కు

# విశేష స్పందన

- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు
- అధికారుల సమక్షంలో ప్రజా దర్బార్
- కిక్కిరిసిన ఏలూరి క్యాంపు కార్యాలయం
- గత ఐదేళ్ళు సమస్యలను గాలికొదిలిన వైసిపి
- ప్రజల కష్టాలు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు









**పర్చూరు, అక్టోబర్ 25 ( నవభూమి )** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిర్వహించిన ప్రజాదర్బార్ కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో "పర్చూరు ప్రజాదర్బార్" ను నిర్వహించారు. ఉదయం 9 గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మమేకమై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో ఆయా సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే కొన్ని సమస్యలను ఏలూరి పరిష్కరించారు. పలు సమస్యలను యుద్ధప్రాతిపాదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రెవిన్యూ, రహదారులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, మంచినీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని అధికారులు సూచించారు. గత ఐదు ఏళ్ళు పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి వచ్చాయి. పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేసేలా అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్, ట్రాన్స్ కో, హార్టికల్చర్, అగ్రికల్చర్, లోని వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్లు అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించి వంద రోజుల్లోనే ప్రజాభిమానాన్ని చురగొన్నమన్నారు. ప్రజల ఆకాంక్షలు కనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామన్నారు. పరిశ్రమలకు నియోజకవర్గ అనుకూలంగా ఉందని వ్యవసాయ రంగంతోపాటు పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. చినగంజాం మండలం, మోటుపల్లి సముద్ర మార్గ రవాణాకు అనుకూలమని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని మోటుపల్లి సముద్ర తీరాన్ని త్వరలో అధికారులు వచ్చి పరిశీలిస్తారన్నారు. సముద్రం రవాణా ద్వారా మోటుపల్లి ప్రాంతం అన్ని రకాల అభివృద్ధి చెందుతుందన్నారు. పెట్టుబడి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం నిరంతరం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానన్నారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను అమలు దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా ఆరు మండలాల తాసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పీ ఆర్, ఆర్ అండ్ బి , ఆర్డబ్ల్యూఎస్, ట్రాన్స్కో, డీఈ లు, ఏఈలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రస్తుతం ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించిన నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాస్



**కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గం అక్టోబర్ 25** జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధర రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు రూరల్ సీ.ఐ సోమేశ్వరరావు పర్యవేక్షణలో నందివాడ ఎస్సై కె. శ్రీనివాస్ ఈ రోజు తుమ్మలపల్లి గ్రామాన్ని సందర్శించి సదరు గ్రామప్రజలకు పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమ నిబంధనలు, డయల్ 100, దొంగతనాలు మరియు ఇతర అంశాలపై అవగాహన కల్పించి గంజాయి వంటి మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు, అలాంటి సమాచారం ఏదైనా తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. మీ వివరాలు గోప్యంగా ఉంచుతామని నేరం చేయడమే కాదు నేరం జరుగుతున్నప్పుడు సమాచారం ఇవ్వకపోతే ఒక కుటుంబానికో ఆడపిల్ల జీవితమే నాశనం అయిపోతుందని సమాచారం ఇవ్వడం సామాజిక బాధ్యతని గ్రామస్థులకు ఆయన తెలియజెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ తో పాటూ ఎన్నో కీలకమైన అంశాలపై గ్రామస్థులతో చర్చించిన నందివాడ ఎస్.ఐ కె.శ్రీనివాస్.

## చడీచప్పుడు లేదు

**విశాఖపట్నం నవభూమి** వార్డు సచివాలయాల్లో సిబ్బంది పెద్దగా కానరావడం లేదు. ఉదయం 11 గంటలకు కూడా కుర్చీలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. కొంతమంది రాజీనామా చేసి వెళ్లిపోగా...ఉన్నవారిలో కూడా కొందరు సమయపాలన పాటించడం లేదు. ఒక్కో సచివాలయంలో తొమ్మిది మంది సిబ్బంది ఉండాలి. అయితే గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పలు సచివాలయాలను పరిశీలించినప్పుడు ఇద్దరు, ముగ్గురు మాత్రమే కనిపించారు.గత వైసీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. జీవీఎంసీ పరిధిలో ప్రతి రెండు వేల ఇళ్లకు ఒకటి చొప్పున 578 సచివాలయాలను ఏర్పాటుచేసింది. ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ నుంచి రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు, పక్కా ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల కోసం జీవీఎంసీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేకుండా వార్డు సచివాలయానికి వెళ్లి సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి వార్డు సచివాలయంలో తొమ్మిది మంది ఉద్యోగులు...అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ, ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎం), రెవెన్యూ సెక్రటరీ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలను నియమించింది. ఇలా జీవీఎంసీ పరిధిలోని 578 వార్డు సచివాలయాల్లో 5,022 మంది నియమితులయ్యారు. మొదట్లో పూర్తిస్థాయి సిబ్బందితో సచివాలయాలు కళకళలాడుతుండేవి. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకూ సిబ్బంది సచివాలయంలోనే ఉండేవారు. కానీ తర్వాత సచివాలయాలపై ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడంతో కొంతమంది ఉద్యోగుల్లో నిర్లక్ష్యం పెరిగింది. ఉదయం పది గంటలకు కార్యాలయానికి రావాల్సి ఉన్నప్పటికీ తీరికగా ఏదో సమయంలో కార్యాలయానికి వచ్చి,పోతున్నారు. సంబంధిత కార్యదర్శితో పని ఉండి ఎవరైనా వస్తే...ఫీల్డ్‌కు వెళ్లారనో, కోర్టు కేసు పనిమీద బయటకు వెళ్లారని కార్యాలయంలో ఉన్నవారు సమాధానం చెప్పి పంపించేస్తున్నారు.



### 3 సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకానికి రాష్ట్ర ప్రభుత్వం

# శ్రీకారం చుట్టింది

### జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి



**అమలాపురం. అక్టోబర్ 25.(నవభూమి ప్రతినిధి )** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి తెలిపారు శుక్రవారం అమరావతి నుండి పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి వీర పాండ్యన్ మరియు డి సి ఎస్ మనేజర్ జిలానిలు జేసీలతో వీడియో కాన్ప రెన్స్ నిర్వహించి ఖరీఫ్ లో ధాన్యం సేకరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, చౌక ధరల దుకా ణాలు నిర్వహణ, ధరల నియంత్రణ అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న గ్యాస్ కనెక్షన్ నెంబరు ఆధార్ నెంబరు,రైస్ కార్డు నెంబరు డేటా బేస్ లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులవుతారన్నారు. అటువంటి డేటాను డిపార్ట్మెంట్ డేటాతో సరిపోల్చుకున్నాక అర్హులగా నిర్ధారిం చబడతారన్నారు.అర్హులైన లబ్ధిదారులు ఈనెల 29 నుండి మార్చి 30వ తారీ కు లోపుఒకటి సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు..ఈ విధం గా బుక్ చేసుకున్న సిలిండర్ కు లబ్ధిదారుడు ధరను ఆన్లైన్ లో గాని ఆఫ్లైన్లో గాని చెల్లించా లన్నారు.ఆ సిలిండర్ లబ్ధిదారునికి ఇవ్వబడ్డ తర్వాత అతని అకౌంట్లో ఆయిల్ కంపెనీ వారి సబ్సిడీ జమచేస్తారన్నారు లబ్ధిదారు నికి 24 గంటల లోపల సబ్సిడీ సొమ్ములు జమ చేయబడుతుందన్నారు..ఈ సంవత్సరం ఒక సిలిండర్ పొందాక ఆ వినియోగ దారులకి వచ్చే సంవత్సరం మూడు బ్లాకుల్లో ఉచిత సిలిండర్లు అందజేయబడ తాయన్నారు.ఏప్రిల్ ఆగస్టు మార్చి నెలలో ఈ బ్లాకులు ప్రారంభమవుతాయనీ.ఈ పథకంలో ఏ కారణం చేతనైన పేరు మిస్ అయితే వారు సంబంధిత గ్యాస్ కంపెనీని సంప్రదించవచ్చుననీ ఆమె స్పష్టం చేశారు ధాన్యం సేకరణకు సంబంధించి రాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేయడం మూలంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లు లను ఎంపిక చేసుకుని ఆరు గాలం శ్రమించి పండిం చిన ధాన్యాన్ని రైతులు తర లించి అమ్ముకునే వెసులు బాటు ఉందన్నారు ధాన్యం విక్రయించే రైతులకు మొబైల్ ఫోన్లకు ఐదు సంక్షిప్త మెసేజ్లు (ఎస్ఎంఎస్ )లు కొనుగోలుకు సంబంధించి ఎప్పటి కప్పుడు తెలియ జేయడం జరుగు తుందన్నారు. రైతులు బహిరంగ మార్కెట్లో తాము పండించిన ధాన్యానికి అధిక ధర లభించినట్లయితే అమ్ము కోవచ్చునని కానీ ఆ యొక్క ధాన్యం వివరాలను సంబం ధిత రైతు సేవ కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నవంబర్ ఆరో తేదీ నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ప్రారంభించడం జరుగు తుందన్నారు కందిపప్పు పంచదార నవంబర్ మాసానికి అందు బాటులో ఉంచడం జరిగిందని ఎడిబుల్ ఆయిల్స్ ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని ఆమె . పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి .జిల్లా పౌర సరఫరాల అధికారి ఉద యభాస్కర్ .సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఎస్‌కే మొగ్గు!

**విశాఖపట్నం, (నవభూమి** విశాఖ ఉక్కు ఉద్యోగులు సంస్థ ప్రస్తుత పరిస్థితిని చూసి అందులో కొనసాగడానికి ఆసక్తి చూపడం లేదు. ఉత్పత్తి దారుణంగా పడిపోవడం, ముడి పదార్థాలకు నిధులు లేకపోవడం, కేంద్రం సాయం చేయడానికి ఆచితూచి వ్యవహరిస్తుండడం, అనేక నిబంధనలు అమలు చేస్తుండడం చూసి ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వీఆర్ఎస్ తీసుకుని బయటపడడమే మంచిదని భావిస్తున్నారు.కనీసం 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకొని, 45 ఏళ్ల వయస్సు కలిగిన వారు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని రెండు రోజుల క్రితం యాజమాన్యం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇది ప్రాథమిక సర్వే మాత్రమేనని, దీనికి తెలియజేసే సమ్మతిని దరఖాస్తుగా భావించవద్దని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 29వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం తొలిరోజు 500 మంది, రెండో రోజు 1,200 మంది వీఆర్ఎస్‌కు సమ్మతి తెలియజేశారని తెలిసింది. పదవీ విరమణకు ఇంకా మూడేళ్ల గడువు ఉన్నవారికి ఈ వీఆర్ఎస్ లాభదాయకంగా ఉంటుందని ఉద్యోగ సంఘాలు లెక్కలు వేసి చెప్పడంతో...మూడేళ్ల సర్వీస్ ఉన్నవారంతా అందుకు మొగ్గు చూపుతూ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు.ఇదీ ప్రణాళిక విశాఖ ఉక్కు యాజమాన్యం వీఆర్ఎస్‌పై చాలాకాలంగా కసరత్తు చేస్తోంది. కేంద్రం కూడా ప్యాకేజీ ఇవ్వడానికి ముందే వీఆర్ఎస్‌కు ప్రత్యేకంగా రూ.1,260 కోట్ల బడ్జెట్ కేటాయించింది. ఉక్కు ఉద్యోగుల్లో 1,497 మంది ఎగ్జిక్యూటివ్‌లు, 1,003 మంది నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు వీఆర్ఎస్‌కు ఇవ్వడానికి అంచనాలు తయారుచేసింది. ఎగ్జిక్యూటివ్‌లకు రూ.918.92 కోట్లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.340.19 కోట్లు అవసరం అవుతాయని లెక్కగట్టి మొత్తం రూ.1,260 కోట్లు బడ్జెట్ ఇస్తున్నట్టు తెలిపింది. ఉద్యోగ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది చివరికి వీఆర్ఎస్‌ను అమలు చేసి, 2,500 మందిని తగ్గించనున్నారు.భారీగా పదవీ విరమణలు విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లు. ఏ ఏటికి ఆ ఏడు పదవీ విరమణ చేసే వారి సంఖ్య పెరుగుతోంది. 2011 సంవత్సరంలో 147 మంది పదవీ విరమణ చేయగా, 2021కి వచ్చేసరికి వారి సంఖ్య 732కి చేరింది. 2022లో 960 మంది, 2023లో 1,005 మంది రిటైరయ్యారు. 2024లో మొత్తం 1,248 పదవీ విరమణ చేయనున్నారు. సాధారణంగా కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడిపించే ఉద్దేశం ఉంటే రిటైరవుతున్న వారి పోస్టులు భర్తీ చేస్తూ అవసరాలకు తగ్గట్టుగా కొత్తవారిని నియమించుకోవాలి. కానీ నాలుగేళ్లుగా నియామకాలు నిలిపివేశారు. ఇప్పుడు వీఆర్ఎస్ ఇస్తున్నారు. అంటే ఉద్యోగుల సంఖ్య తగ్గించాలనేది వారి వ్యూహంగా అర్థమవుతోంది.

